సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 1 । జనవరి । 2024



శక్తిస్వరూపిణి.. సర్వమంగళకారిణి

ఈశ్వరీదేవిమఠంలో ఈ నెల 3 నుంచి అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు నిర్వహించనున్నారు. -IIలో



బుడ్డా వెంగళరెడ్డి విగ్రహ ఏర్పాటుకు కృషిచేద్దాం

రేనాటి చంద్రుడు బుడ్డా వెంగళరెడ్డి విగ్రహాన్ని కడపలో ప్రతిష్టించేందుకు కృషి చేద్దామని వక్తలు ముక్తకంఠంతో పేర్కొన్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 197 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	405	482
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1248.740 కిలోలు

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

రాయచోటి: 'కోటి ఆశలతో కొత్త ఆంగ్ల సంవత్సరంలో అడుగిడుతున్న జిల్లా ప్రజలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి,మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, ద్వారకానాథరెడ్డి, నవాజ్‌బాషా, శాసన మండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనలో అమలవుతున్న సంక్షేమ ఫలాలను పొంది ప్రతి ఒక్కరూ అభివృద్ధి పథంలో పయనించాలని తెలిపారు.

'స్పందన' తాత్కాలిక రద్దు

రాయచోటి: జనవరి 1వ తేదీ సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ తెలిపారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డి సర్కిల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కడప రీజియన్ నుంచి 240 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లాలోని ఆరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. జనవరి 10వ తేదీ నుంచి ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, చెన్నై, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కాకినాడ, విశాఖపట్టణం, రాజమండ్రి తదితర ప్రాంతాలకు బస్సులు నడుస్తాయన్నారు.

7న బ్యాడ్మింటన్ మాస్టర్స్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: ప్రొద్దుటూరు పట్టణంలోని జార్జ్ క్లబ్‌లో జనవరి 7వ తేదీ ఆదివారం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ మాస్టర్స్ విభాగం ఎంపికలు జరగనున్నాయి. ఈ విషయాన్ని వైఎస్సార్ జిల్లా చైర్మన్ ఎస్. జిలానీబాషా, అధ్యక్ష, కార్యదర్శులు సింగం భాస్కర్‌రెడ్డి, పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. 35 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులకు ఎంపికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9440223908, 9440107080 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నారీ.. విజయభేరి



నా పేరు వరలక్ష్మి. రాయచోటిలోని జగనన్న మహిళా మార్ట్‌కు అధ్యక్షురాలిగా ఉంటున్నాను. డ్వాక్రా గ్రూపు సభ్యురాలిగా ఉన్న నేను మార్ట్‌లో పెట్టుబడి పెట్టి నిర్వహణ చూసుకుంటున్నాను. ఎప్పటికప్పుడు సరుకులు తెప్పించుకోవడం నుంచి విక్రయాల వరకు పర్యవేక్షిస్తుంటాను. ఈ మహిళా మార్ట్‌లో రోజుకు రూ. 80 వేల నుంచి రూ. లక్షకు పైగా వ్యాపారం జరుగుతుంది. కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉంది.

- విజయవంతంగా మాహిళామార్ట్‌ల నిర్వహణ
- ఎమ్మార్పీ ధరకంటే తక్కువకే సరుకులు
- పలువురు డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పిస్తున్న వైనం
- డ్వాక్రా మహిళలు తక్కువ పెట్టుబడులతో మార్ట్ నిర్వహణ



రాయచోటిలోని మహిళా మార్ట్

సాక్షి రాయచోటి: ఒక్క ఆలోచన వేలాది మందికి తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు అందేలా చేసింది. డ్వాక్రా మహిళలు తక్కువ పెట్టుబడితో ఒక పెద్ద మార్ట్‌ను నడుపుతున్నారు. అందులోనూ బయటి మార్కెట్ కంటే తక్కువకే సరుకులు అందిస్తుండడంతో కొనుగోలుదారులతో మార్ట్‌లు కళకళలాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పలుచోట్ల నెలకొల్పిన జగనన్నమహిళా మార్ట్‌లు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

అంతా మహిళలే

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి, వాల్మీకిపురంలో మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేశారు. ప్రధానంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు నేరుగా నిర్వహించుకునేలా పెట్టుబడి పెట్టి ఏర్పాటు చేశారు. రాయచోటిలోని సుమారు 10 వేల మంది ఒక్కొక్కరు రూ. 150 చొప్పున పెట్టుబడి పెట్టి రూ. 15-20 లక్షల వ్యయంతో జగనన్న మహిళా మార్ట్‌ను 2021 జనవరి 2వ తేదీన ప్రారంభించారు. వాల్మీకిపురంలో సుమారు 10,500 మందికి పైగా సభ్యులు ఒక్కొక్కరు రూ. 300 పెట్టుబడి పెట్టగా...సుమారు రూ. 30 లక్షల పైచిలుకు నిధులతో చేయూత మార్ట్‌ను 2022, నవంబరులో ప్రారంభించారు. రాయచోటిలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న జగనన్న మహిళా మార్ట్‌లో రోజుకు సుమారు రూ. 80 వేల నుంచి రూ. 1.30 లక్షల మధ్య వ్యాపారం జరుగుతోంది. వాల్మీకిపురంలోని జగనన్న చేయూత మహిళా మార్ట్‌లోనూ రోజుకు రూ. 70 వేల నుంచి రూ. లక్ష మేర వ్యాపారం జరుగుతోంది.

డ్వాక్రా మహిళలకు ఉపాధి

జిల్లాలోని మహిళా మార్ట్‌లు పలువురు మహిళలకు ఉపాధిని కల్పిస్తున్నాయి. రాయచోటిలోని మహిళా మార్ట్‌లో డ్వాక్రా గ్రూపులోని సుమారు 12 మంది సభ్యులకు ఉపాధి కల్పిస్తున్నారు. కష్టానికి తగ్గ వేతనాన్ని పొందుతున్నారు. వాల్మీకిపురంలోని మార్ట్‌లో కూడా సుమారు 8 మందికి ఉపాధి లభిస్తోంది. మహిళా మార్ట్‌లలో పనిచేస్తున్న వారందరూ డ్వాక్రా గ్రూపుల్లోని సభ్యులు కావడం విశేషం.

విస్తరణకు ప్రణాళిక

జిల్లాలో జగనన్న మహిళా మార్ట్‌లు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మరికొన్ని ప్రాంతాల్లో కూడా వీటి ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాలు, పెద్ద పంచాయతీలలో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు నాణ్యమైన సరుకులు అందడంతోపాటు డ్వాక్రా మహిళలకు భాగస్వామ్యం కల్పించినట్లుటుందని అధికారులు భావిస్తున్నారు. రానున్న కాలంలో వీటి విస్తరణకు చర్యలు చేపడుతున్నారు.

హోల్‌సేల్ ధరలకే వస్తు సామాగ్రి



రాయచోటిలోని మహిళా మార్ట్‌లో సరుకులు ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

జిల్లాలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ల్లో నిత్యావసర సరుకులు హోల్‌సేల్ ధరలకే లభిస్తున్నాయి. పప్పుల నుంచి నూనె వరకు.. గోధుమ పిండి నుంచి శనగ పిండి వరకు..ఇలా అన్ని రకాల సరుకులు లభిస్తున్నాయి. ఎమ్మార్పీ ధరల కంటే తక్కువకు అందిచడం, నాణ్యతకు పెద్దపీట వేస్తుండడంతో ప్రజలు వీటిపట్ల అధికంగా ఆసక్తి చూపుతున్నారు. బయట కొనుగోలు కంటే మహిళా మార్ట్‌లలో చాలా వరకు కొనుగోలు చేస్తున్నారు.

తక్కువ ధరకే సరుకులు



జగనన్న మహిళా మార్ట్‌లో విక్రయిస్తున్న సరుకులు నాణ్యతతో కూడినవి ఉన్నాయి. అంతేకాకుండా బయటి మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకే లభిస్తున్నాయి. మేము ప్రతి నెల క్రమం తప్పకుండా రాయచోటిలోని మహిళా మార్ట్‌లోనే సరుకులు కొనుగోలు చేస్తుంటాం. చాలా వరకు సరుకులు తక్కువ ధరకు లభిస్తుండడంతో కొంతమేర డబ్బులు ఆదా అవుతున్నాయి. – జి.భాగ్యలక్ష్మి, గృహిణి, రాయచోటి

మహిళా మార్ట్ పనితీరు భేష్



జిల్లాలో మహిళా మార్ట్‌ల పనితీరు బాగుంది. పెట్టుబడితో పాటు యజమానులు కూడా మహిళలే. డీఆర్‌డీఏ, మెప్మాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌ల ద్వారా మహిళలకు ఉపాధి లభిస్తోంది. వస్తువుల నాణ్యత విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రానున్న కాలంలో జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో మార్ట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. – పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్

'హ్యాపీ' న్యూ ఇయర్..!

- ఊరంతా సంబరాలే
- అంతటా శుభాకాంక్షల కోలాహలం
- రోడ్లపై యువత హల్‌చల్



రాయచోటిలో విద్యార్థుల జోష్

సాక్షి, రాయచోటి: నూతన సంవత్సరం అని తలుచుకోగానే ఒక ఉద్వేగం..అంతులేని ఉత్సాహం..రాత్రి 12 గంటలు ఎప్పుడెప్పుడు అవుతుందా అని ఎదురుచూసే క్షణం.. యువత సంబరాలకు ఏర్పాట్లు చేసు కుని మిడ్‌నైట్ ఆనందం కోసం ఎదురు చూశారు. ఎట్టకేలకు ఆ సమయం రానే వచ్చింది. వీధుల్లో గుంపులుగా చేరిన యువకులు రాత్రి సరిగ్గా 12 గంటలు కాగానే హ్యాపీ న్యూయర్ అంటూ అరుస్తూ ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ హత్తుకుంటూ అక్కడికక్కడే కేకులు కట్ చేస్తూ ఒకరినొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేరింతలతో బైకులపై విన్యాసాలు చేస్తూ వీధుల్లో కలియతిరిగారు పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ బందోబస్తు, ఆంక్షలు ఎక్కువగా ఉండడంతో యువత జోష్ ఈసారి కొద్దిమేర తగ్గినట్లు కనిపించింది.

సందడే సందడి

జిల్లా అంతటా ఆదివారం అర్ధరాత్రి నూతన సంవత్సరం సంబరాలు అంబరాన్ని అంటాయి.కొందరు కేకులు కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. బంధుమిత్రులకు అర్ధరాత్రి ఫోన్లలో శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు దర్శనం: దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దర్శనానికి ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ ప్రధాన ద్వారం ద్వారా భక్తులను నూతన సంవత్సర దర్శనాలకు అనుమతించనున్నట్లు ఆయన తెలిపారు. రూ. 15, రూ. 25 టిక్కెట్లపై భక్తులను అనుమతించనున్నట్లు తెలిపారు.

చలిగింతలు!

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో తగ్గిన ఉష్ణోగ్రతలు
- మిచాంగ్ తర్వాత మారిన వాతావరణం
- పెరిగిన చలిగాలులు



మంచుతో కప్పబడిన కడప-రేణిగుంట హైవే



కడప కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన చలి దుస్తుల షాపు

రాజంపేట/కడప అగ్రికల్చర్: నిన్న మొన్నటి వరకు చుర్రుమనే ఎండ.. ఉక్కబోత, శీతలం ప్రవేశించే నవంబరు నెలలో సైతం ఇదే వాతవరణం. వర్షాలు లేకపోవడం ఇందుకు కారణం. కార్తీక మాసం ఆరంభంలో శీతలం మొదలైనా పెద్దగా చలి వాతావరణంలేదు.కానీ మిచాంగ్ తుపాను తర్వాత వాతవరణం మారిపోయింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో చలిపంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. మంచు దుప్పటి ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనికి తోడు రెండు, మూడు రోజులుగా ఎండలు లేకుండా మబ్బుల వాతవరణం. గాలులు వీస్తుండటంతో చలి మరింత వణికిస్తోంది. ఉషోదయం పల్లెలను మంచు దుప్పటి కప్పేస్తోంది.

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. గత నెల ఇదే సమయానికి 34 డిగ్రీల సెల్సియస్ ఉండగా, కనిష్టం 24 డిగ్రీలు వరకు ఉండేది. అది కాస్తా ఇప్పుడు గరిష్టం 27 డిగ్రీల నుంచి 29 డిగ్రీల వరకు, కనిష్ట ఉష్ణోగ్రతలు 19 డిగ్రీల నుంచి 21 డిగ్రీల వరకు తగ్గాయి. రాయచోటి, మదనపల్లె, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట, కడప, బద్వేలు తదితర ప్రాంతాల్లో గరిష్టం 29, కనిష్టం 21 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఉదయం 8గంటల వరకు బయటికి రావడానికి జనం వెనుకంజ వేస్తున్నారు.

రగ్గులు, స్వెట్టర్లకు గిరాకీ

- చలి తీవ్రత తారస్థాయికి చేరడంతో రగ్గులు, స్వెట్టర్లు , మంకీ క్యాప్‌లు గిరాకీ పెరిగింది. రాయచోటి, రాజంపేట, కడప తదితర పట్టణాల్లో మధ్యప్రదేశ్ వాసులు రోడ్ల వెంబడి తాత్కాలిక దుకాణాలు ఏర్పాటుచేసుకొని విక్రయాలు సాగిస్తున్నారు.
- నవంబరు,డిసెంబరు, జనవరి మాసాల్లో వీరి బిజినెస్ బాగానే జరుగుతుంది. ఫిబ్రవరి నెలలో మళ్లీ తమ సొంత రాష్ట్రానికి వెళ్లిపోతామని వ్యాపారులు అంటున్నారు.

రోగాల ప్రమాదం..

చలికాలం తనతోపాటు అనేక రోగాలను కూడా వెంట తీసుకొస్తుంది. ఇప్పటికే దగ్గు, జలుబు, సీజనల్ జ్వరాలబారిన పడుతున్నారు. ఇప్పుడున్న వాతవరణం వల్ల మరింత మంది ఈ జబ్బులబారిన పడే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. పౌష్టికాహారం, వ్యాయామం ద్వారా రోగనిరోధశక్తిని పెంచుకోవాలన్నారు. అధికంగా నీళ్ల తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయే టాక్సిన్స్‌ను చాలవరకు బయటికి పంపవచ్చు. ఈ సీజన్‌లో కాళ్లకు పగుళ్లు రావడం, దురదలు, చర్మం పొడిబారటం వంటి ఇబ్బందులు కలుగుతాయి.

వైద్యుల సలహాలు పాటించాలి



ప్రజలు చలికి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బయటకు వెళ్లాల్సి వస్తే రగ్గులు, మాస్కులు, ధరించాలి. గోరువెచ్చని నీళ్ల తాగడం, సాధ్యమైనంత వరకు వేడి ఆహార పదార్థాలు తినాలి. ముఖ్యంగా చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వీరిని వీలైనంతవరకు మంచుకు, చలికి బయటికి తీసుకెళ్లరాదు. ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.రోగనిరోధకశక్తిని పెంపొదించుకోవాలి.వైద్యుల సలహాలు పాటించాలి.

– అవ్వారు అర్జున్‌కుమార్, రిమ్స్ వైద్యుడు, కడప

వాకర్స్ జాగ్రత్తలు తీసుకోవాలి



తెల్లవారుజామున వాకింగ్ చేసే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చలి ఓవైపు, మంచు మరోవైపు పంజా విసురుతోంది. ముక్కులు, చెవులకు చల్లగాలి తగలకుండా మంకీ క్యాప్‌లు, స్వెట్టర్లు తప్పనిసరిగా ఉపయోగించాలి. వాకింగ్ డ్రస్ పూర్తిగా మెయింటెన్ చేయాలి.

– కె.శరత్‌కుమార్‌రాజు, వైస్‌ప్రెసిడెంట్, వాకర్స్ ఇంటర్నేషనల్

వ్యాపారం బాగా జరుగుతోంది



మధ్యప్రదేశ్ నుంచి వచ్చాం. అక్కడి నుంచే స్వెట్టర్లు, రగ్గులు, మంకీక్యాప్‌లు తీసుకొచ్చాం. మూడునెలల పాటు ఇక్కడ విక్రయాలు సాగిస్తాం. చలి సీజనల్‌లో ప్రతి ఏడాది వస్తుంటాం. వైఎస్సార్, కడప, అనంతపురం జిల్లాల్లో వ్యాపారం కొనసాగిస్తాం. మధ్యతరగతి, పేదలకు అందుబాటులో ధరలు ఉంటాయి. వ్యాపారం బాగా జరుగుతోంది.

–ఇర్ఫాన్ పఠాన్, వ్యాపారి, మధ్యప్రదేశ్

బస్సు-లారీ ఢీ


బస్సు, లారీ ఢీ కొన్న దృశ్యం

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని చొప్పావారిపల్లి క్రాస్ వద్ద ఆదివారం బస్సు-లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కండక్టర్ జాఫర్‌కు గాయాలయ్యాయి. ఓ ప్రయాణికురాలు స్వల్పంగా గాయపడింది. కాగా లారీ రాజంపేట వైపు వెళుతుండగా, రాజంపేట డిపోకు చెందిన బస్సు అనంతపురం వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగ ఉండడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. రోడ్డు ప్రమాదం కారణంగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మన్నూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గాలివీడు : మండల పరిధిలోని వైఎస్సార్ వెలిగల్లు రిజర్వాయర్ ఎడమ కాలువ సమీపంలో ఆదివారం బస్సు, బైకు ఢీకొన్నాయి. స్థానికుల వివరాల మేరకు గాలివీడు నుంచి సత్యసాయి జిల్లా తలుపుల మండలం జ్యోతులపల్లె తాండాకు చెందిన నాగరాజు నాయక్ ద్విచక్రవాహనంలో వెళ్తుండగా కదిరి నుంచి రాయచోటికి వస్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజుకు కాలు విరిగింది. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మండల ఎస్‌ఐ వెంకట శివకుమార్ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

మదనపల్లె : పోక్సో కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పట్టణంలోని కృష్ణానగర్‌కు చెందిన హర్షద్‌వలీ(19) స్థానికంగా ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించడంతో పాటు బాలిక ఇంటికి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. రిమాండ్ నిమిత్తం నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

శక్తిస్వరూపిణి.. సర్వమంగళకారిణి

- భక్తుల కొంగు బంగారంగా ఈశ్వరీదేవి
- 3 నుంచి ఆరాధన గురుపూజ మహోత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో శ్రీ ఈశ్వరీదేవి


బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవిమఠం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో కొలువుదీరిన శ్రీ ఈశ్వరీదేవి.. జగన్మాతగా విరాజిల్లుతున్నారు. భక్తుల కొంగుబంగారంగా నిలిచి.. విశేష పూజలందుకుంటున్నారు. శక్తిస్వరూపిణి, సర్వమంగళకారిణిగా ప్రసిద్ధి చెందారు. ఈశ్వరీదేవిమఠంలో ఈ నెల 3 నుంచి అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి చరిత్ర, ఉత్సవాలపై ప్రత్యేక కథనం.

బ్రహ్మంగారిమఠంలో వెలసిన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం పక్కనే ఈశ్వరీ దేవి మఠం ఉంది. పరాశక్తి స్వరూపిణి పార్వతిదేవి, లక్ష్మీదేవి అంశ నుంచి ఈశ్వరీదేవి అవతరించారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆమె 1703లో స్వస్తిశ్రీ స్వభాను నామసంవత్సరంలో జన్మించారు. కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మనవరాలు శ్రీ ఈశ్వరీదేవి. బ్రహ్మంగారి రెండో కుమారుడైన గోవిందస్వామి, గిరియమ్మ దంపతుల పెద్ద కుమార్తె. ఆమె చిన్నప్పటి నుంచే సంస్కృతం, తెలుగు భాషలపై పాండిత్యం సంపాదించారు.

12 ఏళ్ల వయసులోనే..

ఒక రోజు గోవిందస్వామి శయ్యపై పరుండి, తీవ్రమైన ధ్యాన నిష్ఠలో మునిగిపోయారు. అలా మూడు రోజులు ఉన్నారు. పిలిచినా పలకలేదు. దీంతో చనిపోయారేమోనని భావించి.. ఆయన భార్య గిరియమ్మ, బంధుమిత్రులు దుఃఖిస్తున్నారు. అప్పుడు 12 ఏళ్ల వయసు ఉన్న ఈశ్వరీదేవి వచ్చి.. దుఃఖించే అంత పని ఏమీ జరగలేదని వారికి చెప్పారు. నాయన పరమాత్మతో ఆత్మను లీనం చేశారని తెలిపారు. వీరబ్రహ్మేంద్రస్వామి తెలిపిన 'ఓం హ్రీం క్లీం శ్రీం శివాయ బ్రాహ్మణే నమః' అనే బీజాక్షరి మంత్రాన్ని జపించారు. వెంటనే గోవిందస్వామి లేచి కూర్చున్నారు. ఈ విషయాన్ని చూసిన జనం సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. అప్పటి నుంచి ఈశ్వరిదేవి సామాన్య మనిషి కాదని, మహిమాన్వితురాలని గుర్తించారు. తండ్రినే గురువుగా భావించి.. ఆయన ద్వారా మంత్రోపదేశం నేర్చుకున్నారు.

14 ఏళ్ల తపస్సు చేసి..

బ్రహ్మంగారిమఠానికి సమీపాన ఉన్న నల్లమల కొండ గుహలో 14 ఏళ్ల కఠోర తపస్సు చేసి.. అష్టాంగయోగాది, జ్ఞానవాక్‌శుద్ధి పొందారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి స్వప్నసాక్షాత్కార దర్శనం పొంది.. ఆయన ఆజ్ఞ ప్రకారం బ్రహ్మతత్వాన్ని బహుళ ప్రచారం చేయ సంకల్పించారు. తల్లిదండ్రులు వివాహ ప్రయత్నం చేయగా.. నిరాకరించారు. స్వీయ కల్యాణాన్ని త్యజించి లోక కల్యాణార్థం బ్రహ్మచర్య దీక్ష బూని ఆత్మతత్వ బోధనలు రచించారు.

మఠాధీశులై..

తండ్రి గోవిందస్వామి యోగ సమాధి నిష్ఠ వహించిన దివ్య సన్నిధానానికి గర్భగుడి, అంతరాలయం, ముఖ మండపం నిర్మించి ప్రత్యేక(చిన్న) మఠం ఏర్పాటు చేశారు. ఆ మఠానికి మఠాధీశులై నిత్య పూజ కార్యక్రమాలు, ఆరాధన గురుపూజోత్సవాలు నిర్వహిస్తుండే వారు. అమ్మవారి బోధనలు విని ఆకర్షితులై.. ఎంతో మంది శిష్యులుగా మారారు. ఈశ్వరీదేవి రాజయోగినిగా మారి.. శిష్యసమేతంగా దేశ పర్యటన చేసి భక్తితత్వాన్ని ప్రచారం చేశారు. బ్రహ్మంగారిలాగా తత్వాలు, కీర్తనలు, కాలజ్ఞానం రాసి విశేష కీర్తి పొందారు. దుష్ట శిక్షణ, శిష్ట సంరక్షణ చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములను ఈశ్వరీదేవి పిలిచిన 'జేజినాయన' అనే పిలుపు లోకప్రసిద్ధమై.. నాటి నుంచి భక్తజనులు ఆయనను 'జేజినాయన' అని కొలుస్తున్నారు.

సజీవ సమాధి

1789లో శ్రీ సౌమ్యనామ సంవత్సర మార్గశిర బహుళ నవమినాడు చిన్నమఠంలో సజీవ సమాధి నిష్ఠ వహించారు. నాటి నుంచి లోకకల్యాణార్థం యోగ నిద్రముద్రితురాలై భక్తజనుల నిత్య నీరాజనాలు స్వీకరిస్తున్నారు. ఆ ప్రాంతం శ్రీ ఈశ్వరీదేవిమఠంగా పేరొందింది.

ఆరాధనోత్సవాలు

ఈ నెల 3 నుంచి 8 వరకు అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు నిర్వహించనున్నారు. 5న మార్గశిర బహుళ నవమిన సజీవ సమాధి నిష్ఠ వహించిన రోజు కనుక ప్రధాన వేడుకలు నిర్వహిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు.

దర్శనీయ స్థలాలు

బ్రహ్మంగారిమఠంలో దర్శనీయ స్థలాలు చాలా ఉన్నాయి. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, కాలజ్ఞాన ప్రతులు, నివాస గృహం, స్వామి తవ్విన బావి, పోలేరమ్మతో నిప్పు తెప్పించిన రచ్చబండ, కక్కయ్య మఠం, పోలేరమ్మ గుడి, రామాలయం (భజన మందిరం), అచలానందస్వామి ఆశ్రమం, శ్రీమద్వాయత్రి విశ్వకర్మ వంశవృక్ష దేవాలయం, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, బ్రహ్మంసాగర్, ముడుమాలలోని సిద్దయ్య మఠం, అక్కంపేటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం (విభూదిలింగం).

ఘనంగా ఏర్పాట్లు

అమ్మవారి ఆరాధనోత్సవాలకు భక్తుల సహకారంతో మఠం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నాం. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నాను.



- శ్రీ వీరశివకుమారస్వామి, మఠాధిపతి, ఈశ్వరీదేవిమఠం

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



సొంత ఇల్లు లేక బాడుగ ఇంటిలో ఉంటూ జీవనాన్ని గడిపేవాళ్లం. పిల్లలను చదివించుకుంటూ బాడుగలు కట్టాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. సొంత ఇల్లు కట్టుకోవాలంటే స్థలానికి డబ్బులు కావాలి. తిరిగి ఇల్లు ఎలా కట్టుకోవాలనే చింత ఉండేది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చాక మాకు భాకరాపేటలో జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేశారు. అక్కడ ఇల్లు కట్టుకున్నాము. నాకు సొంత ఇల్లు అనేది ఉండటంతో దిగులు పోయింది. చాలా సంతోషంగా ఉన్నాము.

- మునిగాళ్ల లక్ష్మీదేవి, భాకరాపేట, సిద్దవటం మండలం

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు



నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. నాడు-నేడు పనులు పూర్తయిన పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరాయి. ఆధునిక పద్ధతుల్లో బోధన చేస్తున్నారు. అందువల్ల విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందుతోంది. రాజంపేట మండలంలో మొదటి ఫేస్‌లో 42 పాఠశాలలు నాడు-నేడు కింద పూర్తయ్యాయి. రెండవ ఫేస్‌లో 48 పాఠశాలల్లో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్లే ఇది సాధ్యమైంది.

- కొండూరు రఘునాథరాజు, ఎంఈఓ, రాజంపేట

బుడ్డా వెంగళరెడ్డి విగ్రహ ఏర్పాటుకు కృషిచేద్దాం

వర్ధంతి సభలో వక్తలు


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్ : రేనాటి చంద్రుడు, అభినవ దానకర్ణుడిగా పేరొందిన బుడ్డా వెంగళరెడ్డి విగ్రహాన్ని కడప నగరంలో ప్రతిష్ఠించేందుకు కృషి చేద్దామని వక్తలు ముక్తకంఠంతో పేర్కొన్నారు. ఆయన 123వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తొలుత వెంగళరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్ మాట్లాడుతూ కష్టకాలంలో ఆదుకునే, మానవత్వానికి నిదర్శనమైన, స్ఫూర్తిదాయకమైన కీర్తికి శాశ్వతత్వం కల్పిద్దామన్నారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ వెంగళరెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు నగర కార్పొరేటర్లు పూనుకోవాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ బలమైన గళం వినిపించాలని సూచించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ 19వ శతాబ్దంలో తమ ప్రాంతంలో కరువు కరాళనృత్యం చేస్తున్నప్పుడు మూడు నెలల పాటు మూడు పూటలా ప్రజల ఆకలి తీర్చిన బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం భావి తరాలకు స్ఫూర్తినిస్తుందన్నారు. ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ మహాదాత బుడ్డా వెంగళరెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ద్వారా మానవతా విలువలను ప్రతిష్ఠించినట్లు అవుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ వెంగళరెడ్డి దాతృత్వం గురించి విస్తృత ప్రచారం చేయాలని, భావితరాలకు అవగాహన కల్పించాలని కోరారు.

విగ్రహానికి రూ. లక్ష విరాళం

రైతు నాయకుడు దేవగుడి చంద్రమౌళీశ్వర్ రెడి విగ్రహం కోసం తనవంతుగా రూ. లక్ష విరాళం ప్రకటించారు. గోదావరి ప్రాంత వాసులు అక్కడి దాత డొక్కా సీతమ్మ గురించి విస్తృతంగా ప్రచారం చేసి విగ్రహాలను స్థాపించడం గమనించాలన్నారు. చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడారు.

మద్యం సీజ్ .. వ్యక్తి అరెస్టు

కలకడ : అక్రమంగా మద్యం బాటిళ్ల విక్రయిస్తున్న విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆదివారం మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి నిర్వహించారు. పాపిరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన షేక్ నూర్‌బాషా అదే గ్రామ సమీపంలోని చింత చెట్టుకింద మద్యం విక్రయిస్తుండగా 20 బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : రాష్ట్ర సరిహద్దులోని చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో భాగంగా ఆదివారం కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తున్న చిన్నగొట్టిగల్లు మండలం తోపురెడ్డిగారిపల్లె పంచాయతీ ఎడంవారిపల్లెకు చెందిన బి.ఓంప్రకాష్(22)ను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. నిందితుడి నుంచి రూ.1,400 విలువచేసే 4 నాకౌట్ టిన్‌బీర్లు, 1 మెక్‌డోవెల్ విస్కీ ఫుల్‌బాటిల్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్‌ఐ రవికుమార్, పాల్గొన్నారు.

కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలు


గాయపడిన ఆదినారాయణరెడ్డి


కారు బోల్తా పడిన ఘటనలో గాయపడిన స్నేహ

మదనపల్లె : కారు బోల్తా పడి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పీటీఎం మండలంలో జరిగింది. ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ సానివారిపల్లెకు చెందిన రామాంజులు భార్య స్నేహ(33) మొలకవారిపల్లెకు చెందిన ఆదినారాయణరెడ్డి(60) తనకల్లు మండలం టి.సదుం పంచాయతీ సున్నంపల్లివారిపల్లెకు చెందిన ఈశ్వరరెడ్డి(50)లు మరో నలుగురితో కలిసి ఆయుర్వేద వైద్యచికిత్స కోసం కారులో బెంగళూరుకు వెళ్లారు. చికిత్స అనంతరం స్వగ్రామాలకు తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలోని పీటీఎం సమీపంలో కారు టైరు అకస్మాత్తుగా పంక్చర్ కావడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడి పల్టీ కొట్టింది. ప్రమాదంలో స్నేహ, ఆదినారాయణరెడ్డి, ఈశ్వరరెడ్డి గాయపడగా, మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పీటీఎం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కంటి అద్దాల షాపులోకి దూసుకెళ్లిన బొలోరో వ్యాన్


బొలోరో వ్యాన్ అద్దాల షాపులోకి దూసుకెళ్లడంతో నుజ్జునుజ్జు అయిన అద్దాలు


గాయపడిన ఎర్రయ్య

సంబేపల్లె : మండల పరిధిలోని సబ్ స్టేషన్ సమీపంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం కంటి అద్దాల షాపులోకి బొలోరో వ్యాన్ దూసుకెళ్లింది. పోలీసుల వివరాల మేరకు సబ్ స్టేషన్ సమీపంలో ఎర్రయ్య అనే వ్యక్తి అద్దాల షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో పీలేరు వైపు నుంచి రాయచోటికి వెళ్తున్న బొలోరో వ్యాన్ అదుపుతప్పి అద్దాల షాపులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎర్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయు. గాయపడిన వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదుపుతప్పి కారు బోల్తా

పెద్దతిప్పసముద్రం: బెంగళూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన ఆదివారం పెద్దతిప్పసముద్రం సమీపంలో జరిగింది. సత్యసాయిజిల్లా తనకల్లు మండలం చీటిమానుపల్లెకు చెందిన ఏడుగురు వ్యక్తులు కారులో బెంగళూరు ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి చీటిమానుపల్లెకు వెళ్లేందుకు పీటీఎం మీదుగా వస్తుండగా కారు యాక్సిల్ కట్ అయ్యి అదుపుతప్పి రోడ్డుపక్కనే బోల్తా పడి ధ్వంసమైంది. కారులోని ఆదినారాయణరెడ్డి (60), స్నేహా (31), కాంతమ్మ (40), ఈశ్వర్‌రెడ్డి (50), శామ్యులమ్మ (45)కు స్వల్ప గాయాలయ్యాయి.